# నేను నేనే-4

**Index** **page no**


| | |
|---|---|
| 64. ప్రయత్నం-అప్రయత్నం | 2 |
| 65. దేవుడు-దైవ సేవ | 4 |
| 66. మార్పు-పూర్ణం | 8 |
| 67. అబద్ధపు ప్రయాణం | 11 |
| 68. ధ్యానం-తపస్సు | 15 |
| 69. సత్-చిత్-ఆనందము. | 18 |
| 70. నిన్ను నీవు ఎప్పటికీ తెలుకోలేవు | 20 |
| 71. కర్తవ్యనిర్వహణ | 23 |
| 72. ఆహా! కనుగొన్నాను.. | 25 |
| 73. పరమపదం | 25 |
| 74. శ్మశానవైరాగ్యం-శాశ్వతవైరాగ్యం | 31 |
| 75. జ్ఞానోపదేశం | 33 |
| 76. విశ్వవృక్షం | 41 |
| 77. మనిషి-ఋషి-మహర్షి | 43 |

## 64.ప్రయత్నం-అప్రయత్నం.

ఎవరికి సాక్షాత్కరించాలో...

ఆత్మే ఎన్నుకొంటుంది అన్నది కఠోపనిషత్తు....

ఆ వాక్యం చాలా అద్భుతమైనది....

ఆ ఎన్నుకోవడం మన ప్రయత్నాలతో...

సాధనలతో ముడిపడి లేదు.

భక్తులు చెప్పే "భగవదిచ్ఛ"అనే మాట కూడా...

దానికి సరిసమానమైనదే.

ఏ అర్హతా లేకపోయినా...

అనుగ్రహించే నియంత భగవంతుడు.

అయినప్పటికీ...

అర్హతను బట్టి అనగా సాధనను బట్టి కూడా... భగవంతుడు అనుగ్రహించిన ఘటనలు లేకపోలేదు...

ఆత్మ చేత మనం ఎన్నుకోబడడానికి...

మనకు ఉండవలసిన అర్హత - ఆర్తి, శ్రద్ధ...

పువ్వులో మకరందం ఉంటే...

భ్రమరం దానికదే వచ్చి ఆస్వాదిస్తుంది...

మనలో ఆర్తి ఉంటే...

ఆత్మ దానికదే వచ్చి ఆవహిస్తుంది...

లావొక్కింతయును లేదు...

అని గజేంద్రుడు మొరపెట్టినప్పుడు...

సిరికి కూడా చెప్పకుండా...

పరుగున వచ్చి కాపాడాడు మహావిష్ణువు...

నీ ఆర్తి నిజమే అయితే....

భగవంతుడు నీ ఇంటి పై కప్పు పగలుగొట్టుకొని మరీ నీ ముందు సాక్షాత్కరిస్తాడు.

నాకు శ్రద్ధ ఉందిగానీ గురువు దొరకలేదు...

అన్నమాట కూడా సరికాదు.

గురువు దొరకడమే నీకు శ్రద్ధ ఉన్నందుకు గుర్తు.

శ్రద్ధ ఉన్నప్పుడు...

నీవున్న చోటుకే వచ్చి నిన్ను అనుగ్రహిస్తాడు గురువు.

అంతేగాని దారినపోయేవాళ్లందరినీ పిలిచి బోధించడు.

అలాంటి విధి, కర్తవ్యం ఏ గురువుకూ లేదు.

అడగండి ఇవ్వబడుతుంది అంటారు క్రీస్తు.

అడిగి పొందినవాడు - శ్రీరామకృష్ణులు.

అడగకనే పొందినవాడు - అరుణాచల రమణులు.

ఆత్మే ఎన్నుకొంది రమణుణ్ణి.

రామకృష్ణులే ఆత్మను పొందారు ప్రయత్నంతో.

ఇద్దరి శైలి వైవిధ్యమైనది.

అందువల్లనే ఇరువురు ఆత్మసాక్షాత్కారానికి చెప్పిన ఉపాయాలు వైవిధ్యంగానే ఉంటాయి.

"ఊరికే ఉండు" అన్నారు రమణులు.

"కామినీకాంచనములు జయించు" అన్నారు రామకృష్ణులు.

ఒకటి అప్రయత్నం.

మరొకటి ప్రయత్నం.

రెండూ సరియే ఆత్మవస్తువు దొరకడానికి.

రెండూ గురియే జ్ఞానఫలాన్ని కొట్టడానికి.

మన సాధనను బట్టి దైవానుగ్రహం లభిస్తుందా?

దైవానుగ్రహాన్ని బట్టి మన సాధన ఉంటుందా?

అని అడిగితే తేల్చి చెప్పడం కష్టం.

రెండూ సరియే.

మొదటివారు కర్మయోగులు.

రెండవవారు భక్తియోగులు.

ఒకడికి కర్మే భక్తి.

మరొకడికి భక్తే కర్మ.

*********

## 65.దేవుడు-దైవ సేవ

దేవుణ్ణి పొందాలి....

అని ఎవరైనా గురువును అడిగితే...

దేవుణ్ణి ఏంచేసుకుంటావు...?

అని అడుగుతారు...

దేవుణ్ణి ఒక్కరోజు భరించగలవా...?

అని నవ్వుతూ ప్రశ్నిస్తారు.

పొద్దున లేచి...

సుప్రభాతసేవ నుంచి...

ప్రతిపూటా నైవేద్యాలు సమర్పించడం నుంచి...

రాత్రి పవళింపుసేవ వరకు...

ఎంత డబ్బు ఖర్చు అవుతుంది...?

ఎంత సమయం కేటాయించాలి...?

నీవు చేసే ఉద్యోగం కూడా చేయలేని పరిస్థితి వస్తుంది...

నీ కుటుంబ సభ్యులతో కాసేపు గడపడానికి కూడా వుండదు...

నిన్ను ఒక్క నిమిషం కూడా ఎడంగా ఉండనీడు...

నిన్ను అట్టే అంటిపెట్టుకుని ఉంటాడు...

నీ సమస్యలు వినడు...

నీకేమీ వరాలు ఇవ్వడు...

నేను కావాలన్నావుగా...వచ్చాను...అంతే...

అంటాడు...

నీకు తప్ప ఎవడికీ కనబడడు...

నీవు దేవుడితో మాట్లాడుతున్నప్పుడల్లా...

నీ వాళ్లే నిన్ను పిచ్చివాడిలా చూస్తారు...

నీకు తాయెత్తులు కడతారు...

ఇలా ఎంతకాలం భరిస్తావు దేవుణ్ణి...?

ఇంతవరకు "దేవుణ్ణి పొందటం ఎలా?"

అనే పుస్తకాలే చదివుంటావు....

ఇక ఇప్పట్నుంచి...

"దేవుణ్ణి వదిలించుకోవడం ఎలా?"

అనే పుస్తకాలు ఎక్కడ దొరుకుతాయా?

అని గ్రంథాలయాల్లో వెతుకుతావు...

లోకం నిన్ను పిచ్చివాడిలాగా చూస్తుంది.....

"లాగా" ఏంటి...

నిజంగానే పిచ్చివాడివయిపోతావు...

ఇప్పుడు చెప్పు ...నీకు దేవుడు కావాలా......?

అందుకే గురువు అంటాడు-

దేవుణ్ణి దేవుడిగా భరించలేవు కాబట్టే...

దయామయుడైన ఆ దేవుడు...

నీకు అత్యంత దగ్గరగా గడపాలని...

నీ తల్లిదండ్రుల రూపంలో...

భార్య రూపంలో...

భర్తరూపంలో...

బిడ్డల రూపంలో...

అవతరించి ఉన్నాడు...

నీ కుటుంబానికి నీవెంత సేవ చేయగలవో చేయి...

అదంతా దేశ సేవే అవుతుంది...

దైవ సేవే అవుతుంది...

ఎవడి వాకిలి వాడు శుభ్రం చేసుకుంటే...

ఏకకాలంలో ఊరంతా శుభ్రం అయినట్టుగా...

ఎవడి కుటుంబానికి వాడు న్యాయం చేయగలిగితే...

ఏకకాలంలో దేశం సుభిక్షంగా తయారవుతుంది...

మహనీయులు సంసారాన్ని వదలమని  చెప్పారంటే...

కుటుంబాన్ని వదలమని  కాదు...

ఇహ-పర సుఖాలను పొందటానికి...

ఋషులు ఏర్పర్చిన సువ్యవస్థయే కుటుంబం...

సంసారం వేరు...

కుటుంబం వేరు...

కర్తృత్వభావనే సంసారం...

కర్తృత్వభావనను వదలమని చెప్పారు...

భగవంతుని చేతిలో తానొక పనిముట్టు...అంతే.

పనిముట్టు ప్రయోజనం పనిముట్టుది కాదు...

దానిని ఉపయోగించేవాడిది...

గాంధీ సత్యంతో ప్రయోగం చేయడం కాదు...

సత్యమే గాంధీతో ప్రయోగం చేసింది...

రమణుడు జ్ఞానాన్ని పొందడం కాదు...

జ్ఞానం రమణుణ్ణి పొందింది.

మనకు ఏదీ విశేషణం కాదు...

భగవంతునికున్న విశేషణాలే సకలమూ...

తన పరిమితుల్ని గుర్తించడమే శరణాగతి...

కర్త తాను కాదని తెలుసుకోవడం కర్మయోగం.

భగవంతుని చేతిలో తానొక పరికరం అన్న జ్ఞప్తియే భక్తియోగం.

సంయోగ వియోగములకు వీలుకానిది జ్ఞానయోగం...

*******

## 66.మార్పు-పూర్ణం

ఏ పరిస్థితి వచ్చినా, పోయినా...

వచ్చేదాన్ని పోయేదాన్ని చూస్తూ ఉండండి...

లేదంటే చూడడం మానేయండి...

ఆకాశంలో మబ్బులు వస్తూ ఉంటాయి...

పోతూ ఉంటాయి...

చూడాలనిపిస్తే చూడండి...

లేదంటే చూడడం మానేయండి...

అంతేగానీ

మబ్బులు రావాలి అనిగానీ...

రాకూడదు అనిగానీ అనుకోవడం యెందుకు?

ఆధ్యాత్మికం అంటేనే...

లాభనష్టాలు లేని వ్యాపారం...

వ్యాపారం చేయడంవలన లాభమూ లేదు...

చేయకపోవడం వలన నష్టమూ లేదు...

చేయాలనిపిస్తే చేయండి...

వద్దనుకుంటే ఊరికే ఉండండి...

వ్యాపారం చేసేవాడు సాధకుడు...

ఊరికే ఉండేవాడు సిద్ధుడు...

పూర్ణంలో పూర్ణం కలిపినా పూర్ణమే...

పూర్ణంలో పూర్ణం తీసేసినా పూర్ణమే...

పూర్ణం సదా పూర్ణంగానే ఉంటుంది...

ఆకాశం ఒకచోట చిక్కగానూ...

మరోచోట పలుచగానూ ఉంటుందా...

బ్రహ్మమూ అంతే...

ప్రతి అణువూ...

ప్రతిక్షణమూ...

పూర్ణంగా ఉన్నది...

నీ విషయంలోగాని...

జగత్తు విషయంలోగాని...

దేవుని విషయంలోగాని...

నీవిప్పుడు నడుంకట్టి...

మార్పు తేవలసిన అవసరంగానీ...

అవకాశంగానీ...

లేనేలేదు...

ప్రతీది సహజంగా, పూర్ణంగా ఉన్నది...

దేనికీ ఆశ్చర్యపడకు...

దేనికీ సంతోషించకు...

దేనికీ గుండెలు బాదుకోకు...

దేనినీ ప్రేమించకు...

దేనినీ ద్వేషించకు...

దేనినీ సమర్థించకు...

దేనినీ విమర్శించకు...

అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ ఒకరమే...

అక్కడ ఇక్కడ ఎక్కడా ఏకమే...

కళ్లు తెరిస్తే అనేకం...

కళ్లు మూస్తే ఏకం...

కళ్లు తెరిస్తే ప్రపంచం...

కళ్లు మూస్తే స్వరూపం...

నిద్ర నిన్ను ఆవహించినట్లే...

మెలకువా నిన్ను ఆవహిస్తుంది...

అజ్ఞానము నిన్ను ఆవహించినట్లు...

జ్ఞానమూ నిన్ను ఆవహిస్తుంది...

సాధన నిన్ను ఆవహిస్తే సాధకుడు అవుతావు...

సిద్ధి నిన్ను ఆవహిస్తే సిద్ధుడు అవుతావు...

సాధన చేస్తే చేయి, మానితే మాను...

ఏదీ నీ స్వాధీనంలో లేదు...

అని తెలుసుకుంటే చాలు...

నువ్వు మహాజ్ఞానివే...

* * *

## 67. అబద్ధపు ప్రయాణం

కలంతా అసత్యం...

కలకనేవాడు సత్యం...

జీవితం అంతా అసత్యం....

జీవించేవాడు సత్యం...

ఇదే వేదాంతసారం...

ఆ అనుభవం ఎలా కలుగుతుంది...?

అని అడుగుతుంటారు...

"కలుగుతుంది"...అంతే...అంటాడు  గురువు ....

ఎలా అనేది మనసు జేసే మాయాజాలం..

ఎలా అనేది వదిలేస్తే అక్కడే ఉంటుంది మాయాతీతం...

పై పక్షి వద్దకు చేరాక తెలుస్తుంది

క్రిందపక్షి లేదని..

కలిగాక తెలుస్తుంది....

కలగడం అనేది లేదని....

ఆ అనుభవం కలిగేవరకు...

అబద్ధపు ప్రయాణం తప్పదు.....

ఆ అబద్ధపు ప్రయాణానికే సాధన అని పేరు....

సాధన వద్దన్నా ఆపరు...

చేయమన్నా చేయరు....

ఇదే లోకం తీరు...

సాధ్యం కానిదాని కోసం సాధన ఏమి...?

అప్రయత్నంగా ఉన్నదాని కోసం ప్రయత్నమేమి...?

ఏ సాధనా చేయకపోవడమే గొప్ప సాధన...

ఏ ప్రయత్నమూ చేయకపోవడమే గొప్ప ప్రయత్నం...

నిద్ర లేవడానికి అలారం ఉంటుదేగానీ....

నిద్ర రావడానికి అలారం ఉండదు కదా...

మొదటిది ప్రయత్నం...

రెండవది అప్రయత్నం...

నీవు చేసే ప్రతి ప్రయత్నమూ...

నీవు అప్రయత్నంగా ఉండటానికే...

తనువు కదులుతుంటుంది...

కదలనీ...

చిత్తం చలిస్తుంటుంది...

చలించనీ...

ఆత్మ అచలంగా ఉంటుంది...

ఉండనీ...

తనువు, చిత్తం కదలడం ఆగదు...

ఆత్మను కదిలించడం కుదరదు...

అది అంతే...

ఇది ఇంతే...

"అనుభవం" ఉంది...ఇది నిశ్చయం...

"అనుభవి" లేడు...ఇది నిశ్చింత...

"అనుభవం" ఉందని ఎలా చెప్పగలవు?

ప్రతిబింబం ఉందంటే బింబం ఉండబట్టే కదా...

కానీ ఉనికి ఉండేది బింబం ఒక్కదానికే...

ప్రతిబింబం బింబాన్ని ఎలా పొందగలదు?

"అద్దం" మాయ...

కలలోనివాడు ఆ కలను కనేవాణ్ణి ఎలా పొందగలడు?

"కల" మాయ...

జీవుడు దేవుణ్ణి ఎలా పొందగలడు?

"మెలకువ" మాయ...

* * *

నేను ఉద్యోగస్తుణ్ణి అనుకున్నంత మాత్రాన...

ఉద్యోగస్తుడివి కాలేవు...

నీకు ఉద్యోగం వస్తేనే ఉద్యోగస్తుడివి కాగలవు...

కానీ ముక్తి విషయంలో అలా కాదు...

ముక్తి పొంది, ముక్తుడవడం కాదు...

నేను ముక్తుణ్ణి అని అనుకోవడం వలన...

ముక్తుడవుతావు...

లౌకికవిషయాల్లో...

అవడం అయ్యాక అనుకోవడం జరుగుతుంది...

ఆధ్యాత్మిక విషయంలో...

అనుకోవడం జరిగాక అవడం అవుతుంది...

నేను శ్రీధర్ అనే అబద్ధాన్ని అనుకుని అనుకుని...

నిజం చేసేసుకున్నావు...

నేను బ్రహ్మమును అనే నిజాన్ని అనుకుని అనుకుని...

నిజం ఎందుకు చేసుకోలేవు...

ముక్తుడే నా గడప దాటి లోపలికి రాగలడు...

నేను ముక్తుణ్ణి కానని నీవనుకుంటే,

నీవు కూర్చున్న చాపకి కూడా అవమానం...

* * *

## 68. ధ్యానం-తపస్సు

మనసు స్థిరంగా ఉండాలంటే ఏం చేయాలి...?

అని అడిగారొకరు...

స్థిరంగా ఉన్నా ఒకటే...

స్థిరంగా ఉండకపోయినా ఒకటే...

అని తెలిస్తే...అప్పుడు తెలుస్తుంది...

స్థిరత్వం అంటే ఏంటో...

అన్నారు గురువుగారు...

కదలగలిగి కదలకుండా ఉండేది నిశ్చలం...

కదలడానికి అవకాశం లేక కదలనిది అచలం...

సిద్ధాంతం కాని సిద్ధాంతం అచల సిద్ధాంతం...

'ఉన్నది ఒక్కటే' అని ఉంటాడు జ్ఞాని...

'ఉన్నది ఒకటే' అని అంటాడు అజ్ఞాని...

ఉండడం జ్ఞానలక్షణం...

అనడం అజ్ఞాన లక్షణం...

ఉంటే 'ఒకటే' ఉంటుంది...

అంటే 'రెండు' అయిపోతుంది...

శరణాగతి అంటే...

అప్రయత్నంగా దేవుణ్ణి పొందటం...

సాధన అంటే...

ప్రయత్నపూర్వకంగా దేవుణ్ణి పొందటం...

పడవసహాయంతో నది దాటేవాడు భక్తియోగి...

ఈతకొట్టుకుంటూ నది దాటేవాడు కర్మయోగి...

ధ్యానకేంద్రాలూ పెరుగుతున్నాయి...

కౌన్సిలింగు సెంటర్లూ పెరుగుతున్నాయి...

యోగాక్లాసులూ కిటకిటలాడుతున్నాయి...

ఆసుపత్రులూ కిటకిటలాడుతున్నాయి...

దేవాలయాలు జనాలతో రద్దీగా ఉన్నాయి...

పోలీస్ స్టేషన్లు, కోర్టులూ రద్దీగా ఉన్నాయి...

తీర్థయాత్రలూ పెరుగుతున్నాయి...

కుట్రలు, కుతంత్రాలూ పెరుగుతున్నాయి...

కారణమేమి...?

మనం చేసే ధ్యానాలలో...

పూజలలో...

ధర్మాచరణలో...

"బలం" లేదు...

"మమేకం" లేదు...

"మమేకం" ఉన్నప్పుడు...

ఆ ధ్యానం తపస్సు అవుతుంది...

ఆ పూజ భక్తి అవుతుంది...

"మమేకం" లేనప్పుడు...

ఆ ధ్యానం కేవలం "మత్తు" అవుతుంది...

ఆ పూజ కేవలం ఓ "తతంగం" అవుతుంది...

ధ్యానం అనే పదం చాలా చిన్నది...

"తపస్సు" అనండి...

తపస్సు చేయాలి అనండి...

తపించండి...తపించండి...

తపనే తపస్సు...

టైంటేబుల్ ధ్యానం వలన ఒరిగేదేమీ ఉండదు...

ఆ కాసేపు రిలాక్స్ తప్ప...

మనం శూన్యంలోనే ఉన్నాం...

శూన్యంగానే ఉన్నాం...

శూన్యానికి బంధమూ లేదు...

శూన్యానికి మోక్షమూ లేదు...

శూన్యం అంటే అకర్తగా ఉండడం...

శూన్యం అంటే అనాసక్తంగా ఉండడం...

శూన్యం అంటే అనంతంగా మారిపోవడం...

శూన్యం అంటే పరిపూర్ణంగా ఉండడం...

* * *

## 69. సత్-చిత్-ఆనందము.

నేను ఉన్నాను అనేది - సత్.

నేనున్నానని నాకు తెలుస్తుండడం - చిత్.

ఆ అనుభవము - ఆనందము.

* * *

ఆత్మ అంటే?

నేను.

* * *

నేను ప్రక్కన 'శ్రీధర్' అని వ్రాస్తేనే

సరిపోయే నేను...

నేను ప్రక్కన ఏది వ్రాసినా సరిపోయే

నేనుగా మారిపోవడమే మోక్షం.

* * *

ఇది మాత్రమే నేను అని ఉన్న నేను...

సకలమూ నేనే అని ఉండే నేనుగా మారిపోవడమే

మోక్షం...

* * *

వెలుపల...వ్యవహారంలో... వ్యక్తిమాత్రంగానే ఉండాలి...

లోపల...అనుభవంలో... సర్వత్రా తానే అయి ఉండాలి.

* * *

నన్ను తల్లిదండ్రులు కన్నారనేది అబద్ధం...

నాతో సకలాన్ని నేను కన్నాను అనేది వాస్తవం...

దేవుడు కూడా నేను కన్నవాడే...

నేనులో నుంచే శ్రీధర్ తో సహా సకలమూ పుడుతుంది...

ఉంటుంది...

తిరిగి శ్రీధర్ తో సహా సకలమూ...

నేనులోనే లయం అయిపోతుంది...

* * *

మరి అఖండమైన ఆ వస్తువు...

యెందుకు ఇన్ని డివిజన్లుగా అయ్యింది...

అని అడిగాడు శిష్యుడు?

యెందుకు అవకూడదు...?

అని బ్రహ్మాస్త్రం వేశారు గురువుగారు...

రాముడి డైలాగులు వ్రాసిందీ వాల్మీకియే...

రావణుడి డైలాగులు వ్రాసిందీ వాల్మీకియే...

ఇంతకీ వాల్మీకి రాముడా? రావణుడా?

ఇద్దరూ తానే...

వాల్మీకిని మరిస్తే...ప్రతిపాత్రా దేనికది సత్యమే...

వాల్మీకి జ్ఞప్తిలో ఉంటే...వాల్మీకి మాత్రమే సత్యం...

"నేను"ను మరిస్తే సకలమూ సత్యమే...

"నేను" జ్ఞప్తిలో ఉంటే "నేను" మాత్రమే సత్యము...

* * *

రచయిత సృష్టించిన హీరోపాత్ర ధనవంతుడై...

సకలభోగాలను అనుభవిస్తుంటాడు...

కానీ ఆ రచయిత అద్దె ఇంట్లో ఉంటాడు...

సృష్టిలోని అన్నిటికీ అన్ని అనుభవాలూ ఉంటాయి...

సృష్టికర్తకు ఏ అనుభవమూ ఉండదు...

* * *

శ్వాస పీలిస్తే జననం...

శ్వాస వదిలితే మరణం...

శ్వాస పరంపరయే జన్మ పరంపర...

* * *

## 70. నిన్ను నీవు ఎప్పటికీ తెలుకోలేవు

1.నిన్ను నీవు తెలుసుకో...

భగవాన్ ఈ మొదటివాక్యం చెప్పి...

రెండవ వాక్యం చెప్పేలోపే

జిజ్ఞాసువులు తన్ను తాను తెలుసుకోవడానికి...

ఆత్మవిచారణలో మునిగిపోయారు...

వారి తొందరపాటు చూసి...

వారి అజ్ఞానాన్ని చూసి...

భగవాన్ మొహంలో చిరునవ్వు మెరిసింది...

అది వారి జీవితాంతం అలానే నిలిచిపోయింది...

ఇక వీళ్లను మార్చడం ఎవరి తరమూ కాదని...

ఊరక ఉండిపోయారు...

కానీ వారి మౌనం, చిరునవ్వుల మీద మాత్రం...

కవిత్వాలు...సిద్ధాంతాలు వ్రాసేసుకున్నారు...

వారు చెప్పదలచుకున్న రెండవ వాక్యం ఏమంటే...

2. నిన్ను నీవు ఎప్పటికీ తెలుకోలేవని...

దీనికి ప్రమాణం వారే వ్రాసిన 'ఉన్నది నలుబది' లో ఉంది...

తన్ను తాను తెలుసుకోవడానికి తాను రెండా?

తాను ఏకమగుట అందరికీ అనుభవసిద్ధము...

అందుకే ప్రతి ఒక్కడూ నేను అంటాడేగాని...

మేము అని అనడు...

తాను సదా ఏక వచనం...

తనను తాను తెలుసుకునే ప్రోగ్రామే లేదు...

అందుకే భగవాన్ "సుమ్మా ఇరు" అన్నారు...

'తెలుసుకోలేం' అని తెలిసి...

స్థిమితంగా ఉన్నవాడు సిద్ధుడు...

'తెలుసుకోగలం' అని ప్రయత్నించేవాడు సాధకుడు...

1.ఆత్మను నీవెప్పటికీ తెలుసుకోలేవు...

2.యెందుకంటే నీవే ఆత్మవు...

అన్నారు వివేకానందులు...

మొదటి వాక్యం వరకే తీసుకుంటే నిరాశావాదం...

రెండవ వాక్యం పూరించుకుంటే ఆశావాదం...

ఏదైనా తెలుసుకోవాలంటే...

అది తనకు విడిగా ఉండాలి...

తానే అయిన (ఆత్మ)వస్తువును...

ఎలా తెలుసుకుంటావు?

ఇతరాన్ని తెలుసుకోగలమేగానీ...

స్వరూపాన్ని తెలుసుకోలేం...

నీవు తెలుసుకునే...అనుభవించే...

ఎంత గొప్పదయినా సరే...

అది నీవు కాదు...

ఏది నీకు తెలియకున్నదో...

ఏది నీకు అనుభవంలోకి రాకున్నదో...

అదే నీ స్వరూపం...

అనుభవం అనేది మనసుకు ఆవలిది...

దానిని మనసుతో ఎలా తెలుసుకోగలవు?

తెలియడం ప్రతీది...

అనుభవించడం ప్రతీది...

నీ మనోపరిధిలోనిదే...

భగవత్సాక్షాత్కారం కూడా నీ మనోవికారమే...

ఏ అనుభవమూ లేకపోవడమే దైవసాక్షాత్కారం...

* * *

## 71. కర్తవ్యనిర్వహణ

మానావమానాలను...

లాభనష్టాలను...

సమానంగా స్వీకరించమన్నారు భగవద్గీతలో...

నాకు సాధ్యం కావడం లేదు గురువుగారూ...

అడిగాడు సురేష్ ...

అది వ్యక్తిత్వభావనలో ఉన్నవారికి చెప్పబడింది...

"నేను సురేష్ ను" అని అనుకునేవాడికి చెప్పబడింది భగవద్గీత...

'నీవు సురేష్  కాదు' అనేది భగవద్గీత సారాంశం...

అర్జునుడు...భగవద్గీతను విని...

కర్త నేను కాదని తెలుసుకొని...

కర్తవ్యనిర్వహణ(యుద్ధం) చేసినట్లు...

నీవు కూడా సురేష్ నుండి విడిపడి...

అలా నీ కర్తవ్యాన్ని నిర్వహించాలి.

విశ్వరూపసందర్శనంలో...

జరగబోయే సినిమాను చూసేశాడు అర్జునుడు.

తాను కేవలం ప్రేక్షకుడే...

దర్శకుడు భగవంతుడే...

అని తెలుసుకునేశాడు అర్జునుడు.

నష్టో మోహః అంటూ...

యుద్ధరంగంలోకి దూకేశాడు అర్జునుడు.

నీ జీవితం కూడా చిన్న కురుక్షేత్రమే...

పోరాటం తప్పదు...

పోరాడాలి తప్పదు...

జయాపజయాలనేవి క్రీడలో భాగం...

క్రీడకు లోపల అందరం ప్రత్యర్థులం...

క్రీడకు బయట అందరం స్నేహితులం...

క్రీడ మొదలు పెట్టే ముందు...

మనమందరం చేసుకున్న నిబంధనే ప్రారబ్ధం...

* * *

## 72 . ఆహా! కనుగొన్నాను..

అక్కడ-ఇక్కడ లేని ప్రదేశం నేను,

అప్పుడు-ఇప్పుడు లేని కాలం నేను,

పైన-కింద లేని అవకాశం నేను,

లోపల-బయట లేని బట్టబయలు నేను,

అది-ఇది లేని ఉనికి నేను,

ప్రశ్న-సమాధానం లేని మౌనం నేను,

చలం-నిశ్చలం లేని అచలం నేను,

సత్యం-అసత్యం లేని సద్వస్తువు నేను,

పాపం-పుణ్యం లేని పరిశుద్ధుణ్ణి నేను,

బంధం-మోక్షం లేని  అనంతం నేను,

నేను-నాది లేని నేను నేను

************

## 73. పరమపదం

1. నేను

2. నేను ఉన్నాను

3. నేను నేనే అయి ఉన్నాను.

4. నా నామము నేను

5. నా రూపము నేను

6. నా అనుభవము నేను

7. నా శక్తి నేను

8. నా శక్తే మహామాయ

9. ఆ మహామాయ వలన

నాలో ఈ ప్రపంచం ఉన్నట్లు ఉన్నది.

కానీ లేనే లేదు.

10.అట్టి ఈ ప్రపంచంలో

నేను ఇప్పుడు ఇక్కడ ఇలా నీలా

ఉన్నట్లు ఉన్నాను

కానీ లేనే లేను

11. నేను నేనే అయి ఉన్నాను

12. నేను ఉన్నాను

13. నేను

* * *

పై వాక్యాలను నీవు పలకడంగా కాకుండా,

నీ లోపల పరమాత్ముడు అంటూ వున్నట్లుగా

నీవు వింటూ ఉండాలి...అన్నారు గురువుగారు.

* * *

ఇవి సాక్షాత్తు పరమేశ్వరుడే తన ఉనికిని

"సద్గురు ద్వారా" తెలియబరచిన వాక్యములు.

ఇది వేదాంతసారము అనదగినది.

సద్గురు హృదయము అనదగినది.

అక్షరరూపంలో ఉన్న దైవం అనదగినది.

* * *

పరమేశ్వరునికి ఈ ప్రపంచం తనలోనే పుట్టి, వుండి, తనలోనే నశించే ఓ కల లాంటిదే.

కలలోని వారిని అనుగ్రహించాలంటే

ఆ కలను కనేవాడు ఏం చేయాలి?

తాను మేలుకోవాలి...లేదా

'ఇది కలే' అన్న జ్ఞప్తిని కలలోని వారికి కలిగించాలి.

మొదటిది - ప్రళయం అవుతుంది.

రెండవది - ప్రబోధం అవుతుంది.

పదము, అర్థము, నామము, రూపము, ఉనికి, జ్ఞానము, అనుభవము, అన్నిటి లక్ష్యమై వున్న ఏకైక స్ఫురణయే "నేను".

ఆ "నేను"కు వ్యాఖ్యానమే ఈ - పరమపదం.

* * *

సాపేక్షకమైన సుఖదుఃఖాల పరంపర నుండి విడివడి శాశ్వత ఆత్మసుఖమును పొందాలనే తీవ్రకాంక్ష ఉన్న ప్రతి ఒక్కరూ, ఎవరికి వారు తమలో తాము ఈ క్రింది రీతిలో విచారణ చేసి ఆత్మసిద్ధిని పొందగలరు.

* * *

"నేను" అని నేను అనలేదు...

అనుకోలేదు కూడా...

కానీ "నేను" అని నాలో నాకు వినబడింది...

నేను ఆశ్చర్యపోయాను...

నేను ఆ "నేను"తో ఇలా విచారణ జరిపాను...

* * *

* నీవు ఎవరు?

1. నేను

* నేను కాక మరో "నేను" నాలో ఉందా?

2. అవును....నేనున్నాను.

కానీ నీవనుకున్నట్లు,

నీలో నేనుండడంకాదు, నాలో నీవున్నావు.

అలలో సముద్రం ఉండదు, సముద్రంలో అల ఉంటుంది.

* నీవెలా ఉన్నావు?

3. నేను నేనే అయి ఉన్నాను.

ఆకాశాన్ని దేనితోనూ సరిపోల్చలేవు.

అనంతమైన "నేను"ను దేనితోనూ సరిపోల్చలేవు.

* నిన్నెట్లా పిలిచేది? నీ నామమేమి?

4. నేను-నేను అంటూ నీలో ఉండి పలికేది నేనే.

కానీ నీవు "నేను"ను నేనని భ్రమపడుతున్నావు.

నా నామము నేను.

* నిన్నెట్లా కొలిచేది? నీ రూపమేమి?

5. నేను-నేను అంటూ తలంపురూపంగా ఉండేది నేనే.

కానీ నీవు నేను తలుస్తున్నానని భ్రమపడుతున్నావు.

నా రూపము నేను.

* నీ అనుభవమేమి?

నీవు 'నేను' అని, నీ మొత్తపు వ్యవహారానికి

ఏ నేను కారణమో, ఆ నేనే "నేను".

సంగీతానికి ఆధారశ్రుతి వలె.

"నేనున్నాను" ఎడతెగని అహంస్ఫురణయే నా అనుభవం.

నా అనుభవం నేను.

* మరి నీ శక్తి ఏమి?

7. నేను-నేను అంటూ సముద్రంలో కెరటంలా లేచే

అహంకార(మనస్సు) రూపంగా ఉన్నది నా శక్తియే.

నా శక్తి నేను.

* ఆ శక్తి ఎట్టిది?

8. అదే మహామాయ.

నాలోని మహామాయే మనస్సు.

నా శక్తే మహామాయ.

* దాని ప్రకటనరూపమేమి?

9. అది ఎప్పుడూ ప్రకటన కాలేదు, కాదు.

ప్రకటన అయినట్టు కనిపించడం అనేది

దానికున్న అతిశయశక్తి అంతే.

ఇంద్రజాలికుడు శూన్యం నుండి వస్తుజాలాన్ని సృష్టించి చూపినట్లు

నాలో అభిన్నంగా ఉన్న ఆ అతిశయశక్తి వలన

నాలో ఈ ప్రపంచం ఉన్నట్లు ఉన్నది.

కానీ లేనేలేదు.

* మరి ప్రపంచమే లేనప్పుడు అట్టి ప్రపంచంలో ఉన్న

నా పరిస్థితి ఏమి?

నేను ఉన్నట్టా? లేనట్టా?

10. కలే ఓ అబద్ధం....అందులో నిజాన్ని వెతికినట్టు

ఆకాశపుష్పమే కల్పన...అది వికసించింది అన్నట్లు

బొత్తిగా అస్సలు ఉనికే లేని ఈ ప్రపంచంలో

నేను ఇప్పుడు, ఇక్కడ,ఇలా,నీలా ఉన్నట్లు ఉన్నాను.

కానీ లేనే లేను.

* అయితే నీవు ఎలా ఉన్నావు?

11. వివిధములైన ఆభరణములుగా ఉన్నా

బంగారం బంగారంగానే ఉన్నది.

కెరటములు ఎన్ని లేచి పడినా సముద్రం సముద్రంగానే ఉన్నది.

వ్యక్తిగతమైన నేనులుగా "నేను" ఈ జగత్తులో క్రీడిస్తున్నా సరే,

నేను నేనే అయి ఉన్నాను.

* మరి నీవున్నట్టే కదా?

12. అవును... నేను (మాత్రమే) ఉన్నాను.

* ఇంతకీ నీవెవరు?

13. "నేను"

* * *

నీటిలోనే పుట్టి, తేలి, నీటిలోనే కరిగిపోయే

మంచుశిలవలె అహంకార రూపమైన నేను,

అహంస్వరూపమైన "నేను" లో కరిగి మాయం(మౌనం) అయ్యింది.

*************

## 74. శ్మశానవైరాగ్యం-శాశ్వతవైరాగ్యం

ప్రతి ఒక్కడు సుఖం కావాలని కోరుకుంటాడు...

అంటే తానే సుఖం కావడమన్న మాట...

నీకు సుఖం కాదు...

నీవే సుఖం...

ఖం అంటే ఆకాశం(అనంతం)

సు-ఖం అంటే మంచి ఆకాశం(చిదాకాశం)

నీకు సుఖం కావాలంటే...

నీవు అనంతుడివి కావాలి...

వేరే మార్గమే లేదు...

అనంతుడివి కావాలంటే...

నేతి-నేతి అంటూ...

ఈ పరిమితభావాన్ని త్రోసివేయాలి...

వ్యక్తిగా ఉండి అనుభవించే సుఖం...

సుఖం కాదు...

సుఖం అని అనిపించినప్పటికీ.

అది దుఃఖం యొక్క మారురూపం...అంతే.

విషం కూడా మొదట్లో మత్తుగానే ఉంటుంది...

చివర్లో ప్రాణం తీస్తుంది...

పాముపడగనీడ అని తెలియక...

ఆహ్! ఈ నీడ యెంత సుఖము...!

అనుకుందట ఓ కప్ప...

మరుక్షణం కప్ప మాయం అయ్యింది...

పాముపడగనీడలే ఈ లౌకిక సుఖాలన్నీ...

దుఃఖం కలిగినప్పుడు మాత్రమే...

నాకెందుకీ దుఃఖం? అని ప్రశ్నిస్తాడు....

సుఖం కలిగినప్పుడు...

నాకెందుకీ సుఖం? అని ప్రశ్నించడు...

నాకెందుకీ సుఖం? అని ప్రశ్నించినవాడే...

నిజమైన తత్త్వాభిలాషి అనాలి...

సుఖదుఃఖాలు రెండూ....

దుఃఖం యొక్క రెండు రూపాలు...

అని తెలిసి...

సుఖదుఃఖాలు రెంటినీ వదిలి ఉండడమే...

పరమసుఖం.

లాభమూ వద్దు...నష్టమూ వద్దు...

అని ఉండడమే గొప్ప లాభం.

మనక్కావలసింది శ్మశానవైరాగ్యం కాదు...

శాశ్వతవైరాగ్యం...

మనక్కావలసింది ఇప్పటికి సుఖం కాదు...

యెప్పటికీ సుఖం...

* * *

నాకు సుఖం కాదు...నేనే సుఖం.

నాకు జ్ఞానం కాదు...నేనే జ్ఞానం.

నాకు ఆనందం కాదు...నేనే ఆనందం.

నాకు దేవుడు కేంద్రం కాదు...

దేవుడిక్కూడా నేనే కేంద్రం...

********

## 75. జ్ఞానోపదేశం

నేనును ఎలా తెలుసుకోవడం?

* * *

నేను అనేది అనంతమైన వస్తువు...

దానిని తెలుసుకోవడానికి విడిగా ఎవరూ లేరు...

* * *

దానితో కలిసి, దానిలో ఉండటానికి ఏంచేయాలి?

* * *

"నేను"ను మినహాయించి ఏమీలేదు...

నీవూ అందులో భాగమే...

దానితోనే ఉన్నావు...

దానిలో కలిసే ఉన్నావు...

* * *

దానిలో  ఉన్నామనే అనుభూతి ఎలా కలుగుతుంది?

* * *

ఆ అనుభూతి దానికదే కలుగుతుంది...

సూర్యోదయం అయినట్టు జ్ఞానోదయం అవుతుంది...

అది ప్రయత్నంతో కలగనే కలుగదు...

దానికదే కలుగుతుంది.

* * *

మరి నా విషయంలో దానికదే కలగడంలేదేమి?

* * *

దానిష్టం...

దానినే భగవదిచ్ఛ...అనేది మనం.

* * *

భగవంతుడు, గురువు ఒకరే కదా?

* * *

భగవంతుడు-గురువు-నేను....

మూడింటి అర్థం ఒక్కటే...

* * *

గురుపాదాలకు శరణు శరణు...

గురుపాదాలే నాకు దిక్కు?

* * *

దిక్కులు లేనివాడు గురువు...

అనంతుడు...

* * *

సర్వత్రా ఉన్న గురుపాదాలకు శరణం?

* * *

ఆ సర్వత్రాలో నీవు కూడా ఉన్నావు...

* * *

ఉన్నది నాకు ఉన్నట్టుగా తెలియడం లేదు...

అనుభూతి చెందడం లేదు...

అనుభవం కలగడం లేదు...

* * *

అనుభవం దానికదే కలుగుతుంది...

నీ ప్రయత్నంతో అనుభవం కలుగదు...

* * *

శరీరం విడిచాక...

నేను అనేది ఎక్కడికి వెళుతుంది...?

* * *

శరీరంలో నేను ఉండడం కాదు...

నేనులో శరీరంతో సహా సర్వమూ లేచి...

నేనులోనే అణగుతుంది...

సముద్రంలో పడి లేచే కెరటం వలె.

"నేను" అనేది ఎక్కడికీ పోదు, రాదు...

ప్రవాహం నదికేగాని...

సముద్రానికి ప్రహహం ఉండదు...

* * *

అంటే అది సర్వవ్యాపకమైనది...

* * *

అవును...

* * *

అది ఎలా అర్థమయ్యేది...

* * *

ఎందుకు అర్థం కావాలి?

అర్థం కాకుంటే నష్టమేమి?

* * *

అది నాకు తెలిసేలోపు...

శరీరాన్ని వదిలేస్తానేమో...

* * *

పోతే పోనీ...

ఉండేది ఉంటుంది...

ఊడేది ఊడుతుంది...

* * *

అసలు పుట్టుక ఎందుకు వచ్చింది?

* * *

పుట్టిన అనుభవం నీకు లేదు...

కాబట్టి నీవు పుట్టనే లేదు...

* * *

అసలు ఉన్నది ఏంటి గురువుగారు?

* * *

దానికి నీవు ఏ పేరైనా పెట్టుకో...

* * *

ఆ నేనును నేను ఎరుకతో తెలుసుకోవాలని...

అనుకుంటున్నాను...

ప్రయత్నం అవసరం లేదా?

* * *

ఇక్కడ లేని దానికి ప్రయత్నించాలి, కానీ ఇక్కడ, అంతటా ఉన్నదానికి ప్రయత్నం అవసరం ఏమి?

అయినా ప్రయత్నించి చూడు...తప్పేముంది...?

* * *

దయచేసి నాకొక మార్గం చూపండీ...

* * *

నాకు తెలియదు...

ఇక్కడే ఉన్న దాని కోసం నేను ఏ మార్గములో వెళ్లాలి!!

నేను ఏ సాధనా చేయలేదు...

* * *

నేను అనుభవం పొందడం ఎట్లా?

* * *

అనుభవం దానికదే కలుగుతుంది...

* * *

దానికదే కలిగేవరకు ఎదురుచూస్తుంటాను...

* * *

మంచిది.

* * *

గురు పాదాలకు శరణం...

గురువునే ధ్యానిస్తాను...

గురువు అనుగ్రహం ఉంటే...

ఆ అనుభూతి కలుగుతుందని ఆశిస్తున్నాను...

* * *

శుభం...

* * *

మీలాంటి జ్ఞానులకు అనుభవం దానికదే కలిగింది...

మాలాంటి వారికి అలా కలగకపోవచ్చు...

* * *

ఎవరికైనా ఒకటే లెక్క...

అదే భగవదిచ్ఛ...

* * *

మరి ఎందుకు నేను స్పష్టంగా...

ఎరుకతో తెలుసుకోలేక పోతున్నాను...

* * *

మనమై తెలుసుకోవడం అసాధ్యం...అసంభవం...

* * *

గురువు ద్వారా...

* * *

ఎవరి ద్వారా వీలుకాదు...

* * *

మూలాన్ని తెలుసుకోకుండా...

ఇలా ఎన్ని రోజులు ఉండడం...

* * *

అది కాలానికి సంబంధించినదికాదు...

కాలంలో పొందేది...

కాలంలోనే పోతుంది...

* * *

సర్వత్రా ఉన్న సర్వాంతర్యామికి...

సాధ్యం కానిదంటూ ఏమీ ఉండదు కదా...

అన్నీ తెలిసిన ఆ "నేను"....

నాలోని అజ్ఞానాన్ని తొలగించలేదా...?

* * *

దానికి ఆ అవసరం లేదు...

జ్ఞానానికి జ్ఞానం తప్ప మరేమీ కనబడదు...

"అజ్ఞానం" అని నువ్వు పెట్టుకున్న పేరు అది...

అజ్ఞానంలో "అ" తీసేయ్....

నువ్వూ జ్ఞానివే...

* * *

మీరు నాకు జ్ఞానోపదేశం చేయండి...

* * *

ఇప్పటివరకు చేసిదంతా జ్ఞానోపదేశమే...

మన ఈ సంభాషణను చదువుతూ ఉండండి....

అదే నేను మీకిచ్చే సాధన...

గురువుగారూ...! నేను పొందాను...

అని మీరు నాకు చెప్పేరోజు ఒకరోజు వస్తుంది...

ఎలా? అని అడక్కండి...

ఎప్పుడు? అని అడక్కండి...

ప్రశాంతంగా ఉండండి....

* * *

ప్రశాంతంగా ఉండలేక పోతున్నాను...

***

ప్రశాంతంగా ఉండడం కోసమే నేను 33.33%, 16.66% మొదలగు న్యూ ఎనర్జీ-అద్వైత సాధనలను సూచిస్తున్నాను...

తర్వాత దానంతట అదే అనుభవం కలుగుతుంది...

***

సరే గురువుగారు...

* * *

మీకు ముక్తి ఇవ్వడం అనేది దేవుని అవసరం...

మీ అవసరం కాదు...

మిమ్మల్ని పొందటానికి దేవుడు సాధన చేస్తున్నాడు...

శివుని ధ్యానానికి అదే అర్థం...

తల్లిదండ్రులు బిడ్డల్ని పొందుతారేగాని...

బిడ్డలు తల్లిదండ్రులను పొందలేరు...

* * *

సదా గురు సన్నిధిలో మీ శిష్యురాలు...

* * *

మంచిది....మీకు సదా శుభం కలుగుగాక...

*****************

## 76. విశ్వవృక్షం

మోక్షానికి మెట్లు ధర్మ మార్గం...

కానీ ఈ బాటలో పయనించాలి అంటే...

చాలా ముళ్లదారులు, రాళ్లూరప్పలుఉన్నాయి... అవి తొలగించుకునే జ్ఞానం...

మీలాంటి జ్ఞానశిశువులు మార్గదర్శకులు...

మాకు ప్రసాదించండి...

* * *

వీలైనంతవరకు మీ లోపల మీతో మీరు గడపండి...

ఇదే దగ్గరిదారి...సులభమైన దారి...

కళ్లు తెరిస్తే సాకారం...కళ్లు మూస్తే నిరాకారం...

బయట కృష్ణ, క్రీస్తు అనే తేడాలు...

లోపల ఇద్దరూ "నేనే".

నా వెలుపల నేను ఉండడం పరధర్మం.

నా లోపల నేను ఉండడం పరమధర్మం.

* * *

పరమధర్మంలో కూడా నేను అనేది ఉంటుందా?

* * *

నేను మాత్రమే ఉంటుంది.

నేను అనేది -

లోపల బీజరూపంగా ఉంటుంది...

వెలుపల విశ్వవృక్షంగా విస్తరిల్లుతుంది...

* * *

పక్వానికొచ్చిన పండు రసభారంతో...

చెట్టు నుండి విడివడుతుంది...

అలాగే బ్రహ్మానందరసానుభూతితో నిండిన మనసు

గురువు నుండి, దేవుడి నుండి విడివడుతుంది.

* * *

ఏ చోటులో మనసు కలవరపడుతుందో

ఏ చోటులో మనసు తలక్రిందులైపోతుందో

ఆ చోటే ఆత్మస్థానం.

మనం స్థిరంగా నిలబడవలసింది ఆ చోటులోనే...

మనసుతో పాటు మనమూ తలక్రిందులైపోకూడదు...

## 77. మనిషి-ఋషి-మహర్షి

నీవు ద్రష్టవు...

నీవు కేవలసాక్షివి...

నీవే కేంద్రము...

దృశ్యం యావత్తు నీ మనోలీలావిలాసము...

ఆత్మగతమైన నేను...

వ్యక్తిగతమైననేను...

అంటూ రెండు నేనులు లేవు.

తోచడం...చూడడం...అనుభవించడం...

ఉన్నాయంటే...అది వ్యక్తిగతమైన నేనే.

ఆత్మగతమైన నేనులో-

తోచడం,చూడడం,అనుభవించడం ఉండవు.

మెలకువ - వ్యక్తిగతమైన నేను.

గాఢనిద్ర - ఆత్మగతమైన నేను.

నేను-నీవు-అతడు తోచినంత వరకు...

అది స్వప్నమే...

ఏమీ తోచకుంటే... ఎవరూ తోచకుంటే...

అదే నిజమైన మెలకువ(గాఢనిద్ర).

ఈ వేదాంతంలో -

తెలుసు అనడానికి సిగ్గుపడాలి...

తెలియదు అనడానికి గర్వపడాలి...

ఏమైనా తోస్తే... నీవు మనిషివి...

ఏమీ తోచకుంటే... నీవు ఋషివి...

నీవు కూడా తోచకుంటే... నీవు మహర్షివి...